


# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

**కర్నూలు నంద్యాల**

గురువారం| 08 జనవరి 2026

పేజీలు 8


# విజయ డెయిరీ వద్ద హైడ్రామా

- డైరెక్టర్లను నిర్బంధించిన పోలీసులు
- సాయంత్రం తహశీల్దార్ ఎదుట బైండోవర్
- భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి సొసైటీ చైర్మెన్‌కు అనర్హుడు
- డైరెక్టర్లు పిపి మధుసూధన్‌రెడ్డి,గంగుల విజయ సింహారెడ్డి

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల విజయ డెయిరీ వద్ద బుధవారం హైడ్రామా నడిచింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు ముగ్గురు డైరెక్టర్లను నిర్భందించారు. నాటకీయ పరిణామాల నడుమ సాయంత్రం అర్బన్ తహశీల్దార్ పత్తి సత్య శ్రీనివాసులు ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. డెయిరీ వద్ద రూరల్ సీఐ ఈశ్వరయ్య, డైరెక్టర్ పిపి మధుసూదన్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... విజయ పాల డెయిరీ డైరెక్టర్లు గంగుల విజయసింహారెడ్డి, పిపి మధుసూదన్‌రెడ్డి, సీమ రవికాంత్‌రెడ్డిలు బుధవారం ఉదయం డెయిరీ వద్దకు వెళ్ళారు. మిగతా 2లో


సీఐతో పిపి మధు వాగ్వివాదం





తహశీల్దార్ ఎదుట హాజరు పరచిన ఎండి ప్రదీప్‌కుమార్, డైరెక్టర్లు గంగుల విజయసింహారెడ్డి, సీమ రవికాంత్‌రెడ్డి

## సంక్రాంతికి ఊరెళితే..
# తస్మాత్ జాగ్రత్త..!

- దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- డిఐజి, జిల్లా ఇంఛార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సెలవులలో సొంతూళ్లకు వెళ్లే ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఐజి, జిల్లా ఇంచార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ బుధవారం జిల్లా ప్రజలకు సూచించారు. మిగతా 2లో


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

## క్రెడిట్ చోరీ రాజకీయాలకు
# తెరలేపిన వైసీపీ

**కుడా చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు**

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుపై వైసిపి క్రెడిట్ చోరీ రాజకీయాలు చేస్తుందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ భోగాపురం నిర్మాణానికి అంకురార్పణ నుంచి ప్రారంభం వరకు అంతా చేసింది సిఎం చంద్రబాబేనని, భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో మిగతా 2లో


మాట్లాడుతున్న కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

## కిరణ్‌బాబును జైలుకు తరలించిన
# ఏసీబీ అధికారులు


ఏసిబికి డబ్బుతో ఎట్టుబడ్డ ఎస్ఐ కిరణ్‌బాబు(ఫైల్‌ఫోటో)

# స్టేట్ ఫుడ్ కమీషన్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**- మధ్యాహ్న భోజన పథకం అమలు పై తీవ్ర ఆగ్రహం**


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న అధికారి లక్ష్మిరెడ్డి

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని బాలికల, బాలుర జడ్పి హైస్కూళ్ళు, మహాత్మాజ్యోతిరావుబాపూలే బీసి బాలికల గురుకులంలోనూ మధ్యాహ్న భోజన పథకం అమలులో అవకతవకలు చోటుచేసుకుంటున్న వైనం బుధవారం రాష్ట్ర ఆహార కమీషన్ మెంబర్ లక్ష్మిరెడ్డి తనిఖీలలో బట్టబయలైయ్యాయి. వివరాలలోకి వెళితే లక్ష్మిరెడ్డి ముందుగా బాలుర జడ్పి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుడ్డు పరిమాణం తక్కువగా ఉంటూ, స్టాకు రిజిష్టరులో కంటే ఏకంగా 500 గుడ్లు తక్కువగా ఉన్న విషయాన్ని అధికారి లక్ష్మిరెడ్డి గమనించారు. పప్పులోనూ ఉప్పు తక్కువైందంటూ హెచ్ఎం చంద్రావతిపై ఆగ్రహించారు. అనంతరం బాలుర జడ్పిహైస్కూల్ మధ్యాహ్న భోజన నిర్వహణను తనిఖీ చేయగా అక్కడ కూడా గుడ్డు పరిమాణం తక్కువగా ఉంటూ స్టాకు రిజిష్టర్‌లో కంటే ఏకంగా 1000 గుడ్లు ఎక్కువగా ఉన్న విషయాన్ని ఆయన గమనించారు. ఉడికించినవి, వేస్టేజ్ గుడ్లు సైతం ఎక్కువగా మిగతా 2లో


మధ్యాహ్న భోజనంలో రుచి లేదంటూ ప్రిన్సిపాల్ షబానాబేగంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారి

## CHANGE OF NAME

I, S Hafiz Ahamed khadri ( OLD NAME ) S/O S.Moosa khadri H.No: 29-82, Tekke Street Nandyal - 518501, Nandyal Dist, A.P. here by state that I have changed my name S.Hafiz Ahamed khadri (OLD NAME) TO Syed Hafiz Ahamad khadri(NEW NAME)S/O S.Moosa khadri and known as Syed Hafiz Ahamad khadri S/O S. Moosa khadri for all purposes. for all future purposes.

నూతన వధువులు వివాహానికి హాజరైన

## మాజీ ఎమ్మెల్యే శిల్పా

**వెలుగోడు, మేజర్‌న్యూస్:** స్థానిక పట్టణంలోని వైఎస్ఆర్‌సిపి నాయకులు పాన్‌మాలిక్ సోదరి వివాహానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజ రై పార్టీ నాయకులతో కలసి కార్యక్రమంలో పాల్గొని నూతన వధువరులను అశీర్వదించారు. అయనతో పాటు నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి ఊరెళితే..తస్మాత్ జాగ్రత్త..!

(మొదటి పేజి తరువాయి)

పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులు బయటికి వెళ్లే వారు వెళ్లే ముందు తప్పనిసరిగా పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. పండుగ వేళ చాలామంది కుటుంబ సమేతంగా ఊర్లకు వెళ్తుంటారని, ఇదే అదనుగా భావించి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశముందన్నారు. ఇంట్లో ఎవరూలేరని తెలియకుండా ఉండేందుకు రాత్రివేళ లైట్లు వెలిగేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. బస్సుల్లో ప్రయాణించేటప్పుడు విలువైన వస్తువులు, ఆభరణాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు నగదు, బంగారం ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచరాదన్నారు. బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచు కోవడం ఉత్తమమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు, జిల్లా ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఎక్కడైనా అనుమానితులు కన్పిస్తే , అత్యవసర సమయంలో వెంటనే డయల్ 112 ,డయల్ 100కు ఫోన్ చేసి స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## కిరణ్‌బాబును జైలుకు తరలించిన ఏసీబీ అధికారులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కిరణ్ బాబు భార్య వేధింపుల కేసులో భర్త నాగిరెడ్డిపై హత్యాయత్నం కేసు ఉందని అపద్దం చెప్పి భయపెట్టి రూ.30వేలు లంచం డిమాండ్ చేస్తూ ఏసిబికి పట్టుబడిన విషయం పాఠకులకు విధితమే. ఈ మేరకు కిరణ్‌బాబు ఇంట్లో సోదాలు చేసి విచారణ జరిపిన ఏసిబి డిఎస్పీ సోమన్న బుధవారం ఏసిబి కోర్టులో హాజరు పరిచారు. ఏసిబి కోర్టు జడ్జి ఎస్‌ఐ కిరణ్‌బాబుకు 14రోజుల రిమాండ్‌ను విధించింది. దీంతో ఏసీబీ పోలీసులు పంచలింగాల వద్ద ఉన్న జిల్లా జైలుకు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ సోమన్న మాట్లాడుతూ ఇంకా విచారణ కొసాగుతుందని పూర్తిస్థాయిలో విచారణ జరిపి కోర్టుకు సాక్ష్యాలను అందచేస్తామని తెలిపారు.

## క్రెడిట్ చోరీ రాజకీయాలకు తెరలేపిన వైసిపి

(మొదటి పేజి తరువాయి)

అంతా తామే చేశామన్నట్లు వైసిపి నేతలు బిల్డప్ కొట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని తమ ఖాతాలో వేసుకోవాలన్న ప్రయత్నం వైసిపి నీచ రాజకీయ ధోరణి అన్నారు. ఆధారాలు లేకుండా క్రెడిట్ మొత్తం మాకే దక్కుతుందని నిస్సిగ్గుగా చెప్పడం, క్రెడిట్ చోరీకి పరాకాష్ట అని అన్నారు. అబద్దానికి ప్యాంట్, చొక్కా తొడిగితే జగన్ రెడ్డిలానే ఉంటుందన్నారు. 2014-19మధ్య భూసేకరణపై రూ.750కోట్లు ఖర్చుచేస్తే, 2019-24మధ్య వైసిపి ప్రభుత్వ ఖర్చు చేసింది కేవలం రూ.200కోట్లు మాత్రమేనని, రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం జీఎంఆర్‌ను బెదిరించి జగన్‌రెడ్డి లాక్కున్న 500ఎకరాలను తిరిగి ఎయిర్‌పోర్టు కార్పొరేషన్‌కు కేటాయించిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. సిఎం చంద్రబాబుకు డెవలప్‌మెంట్ ట్రాక్ రికార్డు ఉందని, జగన్‌కు ఉన్నది క్రిమినల్ ట్రాక్ రికార్డు అన్నారు. మీ మాటలకు ఏమైనా ఆధారాలున్నాయా జగన్‌రెడ్డి వైసిపికి సవాల్ విసిరారు.

## మాతృభాష పరిరక్షణకు మేనేజర్ కృషి అభినందనీయం

**: నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**: ఆంధ్ర సరస్వత సేవా అవార్డు గ్రహీత చిన్నరాముడుకు సత్కారం**



**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** మాతృభాష తెలుగు పరిరక్షణకు మేనేజర్ ఎన్.చిన్నరాము డు చేస్తున్న కృషి అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నా రు. ఆంధ్ర సరస్వత పరిషత్ నిర్వహించిన 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆంధ్ర సరస్వత సేవా అవార్డును అందుకున్న మేనేజర్ చిన్నరాముడిని, అలాగే సుపీరియర్ ఎంప్లాయిస్ సభ్యుల్లో తొలిసారిగా గ్రేడ్-3 కమిషనర్‌గా పదోన్నతి పొందిన కార్యదర్శి నాగరాజులను బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ పి.విశ్వనాథ్‌తో పాటు డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధి, పరిరక్షణకు మేనేజర్ చేస్తున్న కృషి ప్రతి ఉద్యోగికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. కార్యాలయ కార్యకలాపాల్లో తెలుగు వాడకాన్ని ప్రోత్సహిస్తూ లేఖలు, నివేదికలు, సంతకాలు తెలుగులోనే నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహించడం వల్లే కార్యదర్శి నాగరాజు ఈ స్థాయికి చేరుకోగలిగారని కమిషనర్ కొనియాడారు. కార్యక్రమంలో అదన పు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ కుమార్ రెడ్డి, డీసీపీ వెంకటరమణ, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, ఆర్వోలు జునైద్, ఇశ్రాయేల్, వాజీద్, స్వర్ణలత, సూపరింటెం డెంట్లు రామకృష్ణ, సుబ్బన్న, మంజూర్ బాష, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విజయ డెయిరీ వద్ద హైడ్రామా

(మొదటి పేజి తరువాయి)

కొద్దిసేపటికే పోలీసులు అక్కడికి చేరుకొని డైరెక్టర్లను నిర్భందించారు. ఒక సమయంలో డైరెక్టర్లను బైండోవర్ చేస్తున్నట్లు వారికి సీఐ ఈశ్వరయ్య వివరించారు. దీనిని డైరెక్టర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. తమపై ఎలాంటి కేసులు లేవని, బైండోవర్ ఎలా చేస్తారని ప్రస్థావించా రు. పోలీసులు ముందు జాగ్రత్తగా బైండోవర్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు డైరెక్టర్లు ససేమిరా అనడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత ఏర్ప డింది. ఒక సమయంలో డైరెక్టర్లను బయటకు వెళ్ళకుండా పోలీసులు నిర్భందించారు. డెయిరీ ఆవరణంలో గంగుల, పిపిలు మాట్లాడుతూ ముత్యాలపాడు సొసైటి అధ్యక్షులుగా భూమా విఖ్యాత్‌రెడ్డి ఎన్నికపై వివాదాల పరిష్కార కమిటి నోటిసులను జారీ చేసిందన్నారు. ఇప్పటికి మూడుసార్లు పోలీసులను అడ్డం పెట్టుకొని విచారణను వాయిదా వేయించారన్నారు. సొసైటిలో భూమా పేరు లేదన్నారు. అలాంటిది అతనిని ఎలా ఎన్నుకున్నారన్నారు. రాజకీయ కక్షతో తమను నిర్భందిం చడం తగదన్నారు. జగత్ విఖ్యాత్‌రెడ్డిని డెయిరీ చైర్మెన్‌గా చేయాలనే ఉద్దేశ్యంతో ఇదంతా పోలీసులను అడ్డం పెట్టుకొని చేస్తున్నారన్నారు. డెయిరీకి రూ. 1.20 కోట్లు అప్పు ఉన్నందుకే విఖ్యాత్‌రెడ్డిని డిస్‌క్వాలిఫై చేసిన విషయాన్ని వివరించారు. దౌర్జన్యంగా డెయిరీలోకి ప్రవేశించాల ని భావిస్తున్నారన్నారు. తమను బైండోవర్ చేయడంపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. మధ్యాహ్న సమయంలో మధుసూదన్‌రెడ్డి నాటకీ య పరిణామాల మధ్య డెయిరీ నుంచి వెళ్లిపోయారు. అక్కడే ఉన్న గంగుల విజయ సింహారెడ్డి, సీమ రవికాంత్‌రెడ్డితోపాటు మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా అర్బన్ తహశీల్దార్ ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు. అనంతరం గంగుల విజయ సింహారెడ్డి మాట్లాడుతూ ఇది మూమ్మాటికి రాజకీయ కక్షతో చేస్తున్నారన్నారు. డెయిరీపై దౌర్జన్యంగా వచ్చిన ఎందుకు బైండోవర్ చేయలేదని ప్రశ్నించారు. సామరస్యంగా విచారణకు హాజరయితే సొసైటి డైరెక్టర్లకు వివరించాలని ప్రయత్నిస్తు న్నామన్నారు. విచారణకు ముత్యాలపాడు సొసైటి డైరెక్టర్లు రావడం లేదన్నారు. ఈ నెల 10వ తేదీన మరోసారి వాయిదా ఉందన్నారు. అందులో భాగంగానే తమను బైండోవర్ చేసి ఇబ్బందులకు గురి చేస్తు న్నారన్నారు. ఇది ఇలా ఉంటే డెయిరీలో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ప్రదీప్‌కుమార్‌ను బైండోవర్ చేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నా యి.ఒక ఉన్నతస్థాయిఅధికారిని బైండోవర్ చేయడంపై తీవ్ర వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తుంది. రాజకీయంగా ఏదైనా ఉంటే ఇరువర్గాలు చూసుకోకుండా ఉద్యోగులను ఇబ్బంది పెట్టడంపై డెయిరీ ఉద్యోగులు నిరసన గళం వినిపిస్తున్నారు. ఎండి బైండోవర్ పై డెయిరీ ఉద్యోగులు గురువారం తమ నిర్ణయాన్ని ప్రకటించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## స్టేట్ ఫుడ్ కమీషన్ అధికారుల ఆకస్మీక తనిఖీలు

(మొదటి పేజి తరువాయి)

దర్శనమిచ్చాయి. డిఈఓను ఫోన్ ద్వారా సంప్రదించే ప్రయత్నం చేయగా అటు నుంచి సమాధానం రాలేదు. హెచ్ఎం రవినాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక మహాత్మాజ్యోతిరావు బాపూలే బీసి గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేయగా మెనూలో లేని రసం వండడం, అదికూడా నీళ్ళుగా ఉండడం, వంట గది అపరిశుభ్రంగా ఉండడం, సాంబారులో కంది పప్పు, పెసరపప్పు అసలే లేకుండా కేవలం శనగపప్పుతో వండడం, ఉడికించిన గుడ్లు ఎక్కువగా మిగిలి కనిపించాయి. ఏకంగా స్టాక్ రిజిష్టర్ నిర్వహణ లేకపోవడం, సాయంత్రం మెనూలోని అన్నం, గుగ్గిళ్ళు ముందే వండి కనిపించడంతో కమీషన్ లక్ష్మిరెడ్డి అవాకై య్యారు. ప్రిన్సిపాల్ షబానాబేగంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబందిత గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవిను ఫోన్‌లో సంప్రదించగా ఆ అధికారి సైతం తన తనిఖీల్లో స్టాకు రిజిస్టర్ నిర్వ హణ సరిగ్గా లేకపోవడం కనిపించిందంటూ సమాధానమిచ్చారు. అనంతరం కేజీబీవిలో తనిఖీలు చేపట్టి అక్కడి మధ్యాహ్న భోజన నిర్వహణ, స్టాకు తదితరాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. హైస్కూళ్ళు, గురుకులాలలో జరుగుతున్న అవకతవకలపై జిల్లా జాయింట్ కలెక్ట ర్‌కు నివేదించినట్లు, సంబందిత హెచ్ఎంలు, ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేసేలా చేస్తానని కమీషన్ మెంబర్ లక్ష్మిరెడ్డి పాత్రికేయులకు వివరించారు. నిర్వహకులు అవినీతికి పాల్పడినట్లు సంబందిత హెచ్ ఎంలు, ప్రిన్సిపాల్ వంత పాడుతున్నట్లు తేటతెల్లమౌతుందన్నారు. ఈ తనిఖీలలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రఘువీరరెడ్డి, తూనికలు, కొలతలశాఖ అధికారి శ్రీరాములు, జీసిడిఓ మేరీ స్నేహలతలు ఉన్నారు.

## ఎస్ఈఆర్‌డిఎస్ సంస్థ ద్వారా హనీబీ బాక్సులు వితరణ

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ఉమ్మడి వనరుల పునరుద్దరణ మరియు, జీవనవైవిద్య పరిరక్షణ ప్రాజెక్ట్ అమలులో భాగంగా, ప్రాజెక్ట్ అమలు అవుతున్న నాలుగు జిల్లాలకు సంబందించి డెమో ప్లాట్‌లో హనీబీ కేంద్రాల ఏర్పాటుకు పూర్ ఆఫ్ ది పూర్ ఫ్యామిలీస్‌ను గుర్తించి, వారికి జీవనోపాధులు మెరుగుదల కోసం ఐటిసి ఎస్ఏఆర్‌డిఎస్ సంస్థ వారి మద్దతుతో తేనె పట్టు సేకరణ బాక్సులను బుధవారం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని ప్యాపిలిలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో నాలుగు జిల్లాలకు సంబందించిన డిసిఓలకు, సిఆర్‌పిలకు తేనెటీగల పెంపకం, తేనె సేకరణ వంటి విషయాలపై సమగ్ర శిక్షణ ఇచ్చి హనీబి బాక్సులు లబ్దిదారులకు ఉచితంగా అందజేశారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా నుండి గూడురు, నంద్యాల జిల్లా నుండి ప్యాపిలి, అనంతపురం జిల్లా నుండి నాయనపల్లి, శ్రీసత్యసాయి జిల్లా నుండి నల్లచెరువు గ్రామాలకు సంబందించిన లబ్దిదారులకు డెమో ప్లాట్ల ఆధ్వర్యంలో సెలెక్ట్ చేసి వారికి హనీబీ బాక్సులు ఇవ్వడం జరిగిందని కామన్స్ ప్రాజెక్టర్ మేనేజర్ బి.క్రాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ ఆర్గనైజర్లు వాసు, నరేష్, రంగారెడ్డి, విశ్వేశ్వర, సిఆర్‌పిలు గిడ్డయ్య, దామోదర, హుస్సేన్‌భాషా, గంగులప్ప, లబ్దిదారులు పాల్గొన్నారు.




హనీబీ బాక్సులను లబ్దిదారులకు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

## వర్మీకంపోస్టుతో పంచాయతీ ఆదాయాన్ని పెంచాలి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ప్రతి గ్రామ పంచాయతీలో వర్మీకంపోస్టును తయారు చేయాలని దాంతో పంచాయతీలకు ఆదాయం పెంచాలని డిప్యూటీ ఎంపీడీవో అనంతశయన, మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీదులలో ప్రజలకు తడి చెత్త పొడి చెత్త వేరుగా వసుకోవడనికి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. అనంతరం వారు చెత్త సంపద కేంద్రం ను అనంతశయన సందర్శించారు. రోజుకు ఎంత చెత్త సేకరిస్తున్నారని దాంతో ఎంత వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసు న్నారని కార్యదర్శి సతీష్ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీ అధికారులు పాటించాలని కోరారు. వర్మీ కంపోస్టును తయారు చేసి రైతులకు అమ్మకాలు జరిపి పంచాయతీలకు ఆదాయాన్ని తీసుకురావాలిన కార్యదర్శులకు సూచించారు. ఎంత మంది సిబ్బంది ఉన్నారు. ఎలా పనిచేస్తున్నారు. పనిలో ఆజాగ్రత్తగా ఉండరాదని సూచిం చారు. గ్రామాలలో తాగునీటి సమస్య, వీదిదీపాల సమస్య లేకుండా చుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీఇన్స్పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్, గ్రీన్‌అంబాసిడర్లు పాల్గొన్నారు.



చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న పంచాయతీ అధికారులు

# బాల్య వివాహాలను అరికట్టాలి..సిడిపివో మంగావళి

**- యువత డ్రగ్స్ కు అలవాటు పడవద్దు .. సీఐ**

**- ఎస్.ఎస్.సి 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుపై దిశానిర్దేశం**

**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** పట్టణ గ్రామీణ ప్రాంతాలలో బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఐసిడిఎస్ సిడిపివో మంగావళి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణ బాల్యవివాహాల నివారణ పై అవగాహన మరియు ఎస్.ఎస్.సి 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుపై సిడిపివో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, కౌమార, గర్భాదరణ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు పూర్తికాకుండా మరియు అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయరాదని సూచించారు. బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచార నేరం అన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికలకు రక్షణ, ఆరోగ్యం ,విద్య , వైద్య వృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సహకారం చేసుకునే అవకాశం దూరమవుతుందన్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో



ప్రతి ఒక్క అంగన్వాడీ కార్యకర్త బాల్య వివాహాలను అరికట్టేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం పట్టణసీఐ వై.ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత గంజాయి మరియు డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. డ్రగ్స్ ,గంజాయిని అరికట్టేందుకు ఈగల్ టీం ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ సిబ్బంది పని చేస్తున్నారని ఏదైనా సమాచారం ఉంటే1972 నెంబర్ కు ఫోన్ చేసి సహకరించాలని కోరారు. ప్యానెల్ న్యాయవాదులు వెంకటేశ్వర్లు, మద్దయ్య ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఆశీర్వాదమ్మ ,వెంకటేశ్వరమ్మ, పావని, హెల్త్ సూపర్వైజర్ సుబ్బారావు, మహిళా పోలీస్‌లు ,వీఆర్వోలు ,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు మార్పు..బాలకృష్ణమ్మ

**-మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తాం: ఏపీటీఎఫ్**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:**ఉపాధ్యాయఉద్యమపితామహుడు కామ్రేడ్ మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను నిరంతరం కొనసాగిస్తామని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన 13వ వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ సభ్యులు. సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, రైతాంగ ఉద్యమాలను మమేకం చేసిన గొప్ప నాయకుడు బాలకృష్ణమ్మ అని కొనియాడారు. ఎమ్మెల్సీగా ఉపాధ్యాయులకు రీగ్రూపింగ్ స్కేల్స్, డీఏ, గ్రాట్యుటీ వంటి హక్కులను సాధించిపెట్టారని గుర్తుచేశారు. ఈ నెల 10న అనంతపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్మారకోపాన్యాస సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ టి. గోపాల్ రావు, సీనియర్ నాయకులు. రాముడు, బి. రాంపుల్లారెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి మల్లెల పుల్లయ్య, కార్యదర్శి మానపాటి రవి, జిల్లా కౌన్సిలర్ నగిరి వెంకటేశ్వర్లు, నంద్యాల జిల్లా అధ్యక్షులు జె. వై. కృష్ణమూర్తి, గడివేముల మండల శాఖ అధ్యక్షులు ఎం.ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. రామ్మూర్తి ,సిరివెళ్ల మండల శాఖ ప్రధాన కార్యదర్శి కాసిం సాహెబ్, కోవెలకుంట్ల మండల శాఖ అధ్యక్షులు ఖలీల్ అహ్మద్, గోస్పాడు మండల శాఖ ప్రధాన కార్యదర్శిబాలవెంకటేశ్వర్లు,జిల్లాకౌన్సిలర్లుమాధవరెడ్డి, లక్ష్మకాంత రెడ్డి, మద్దిలేటి నాయక్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ ప్రాంత ప్రజలకు మేలు జరగాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పం

**ఆదోని, మేజర్ న్యూస్ :** రాయలసీమ ప్రాంత ప్రజలకు మేలు జరగాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పమని కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప పేర్కొన్నారు. గత 5 సంవత్సరాల వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమకు రైతులకు చాలా అన్యాయం చేశారని, దానిని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం 18నెలలోనే సుమారుగా రూ.3,890కోట్లతో 100



మాట్లాడుతున్న రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్

రోజుల్లో 738కి.మీ., కాల్వ వెడెల్పు చేస్తూ, కృష్ణ నుంచి ఉమ్మడి కర్నూలు ఉమ్మడి అనంతపూర్ ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వాలని సంకల్పంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు విద్యుత్ బకాయి ఉన్న 4,500 కోట్లు రైతులకు, ప్రజలకు భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ప్రతి యూనిట్లు 13 పైసలు తగ్గిస్తూ, సంచలన నిర్ణయం తీసుకున్నారు. రూ.3. 70పైసలు తగ్గిస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. యువ నాయకుడు నారాలోకేష్ ఎన్నో విదేశాలు తిరిగి కంపెనీలను తెస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగం కల్పనంగా పనిచేస్తున్నారు. 2029నాటికి 2లక్షల ఉద్యోగాల లక్ష్యంతో పనిచేస్తున్నారు. అలాగే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని 24స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టారన్నారు. 2030కల్లా దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

# ఆళ్లగడ్డలో ఘనంగా త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని గాయత్రి మాత ఆలయం వద్ద మంగళవారం బ్రాహ్మణ సంక్షమ సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు దక్షణామూర్తి ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామికి గాయత్రి మాత ఆలయం వద్ద నుండి నాలుగు రోడ్లకూ డలి వరకు అక్కడినుండి గాయత్రి మాత ఆలయం వరకు గ్రామోత్సవం జరిగింది. గ్రామోత్సవం వెంట నాదస్వర బృందం నిర్వహించిన సంకీర్తనలు చూపర్లను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ పట్టణ బ్రాహ్మణ సంక్షమ సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి సుబ్బారావు,ఉపాధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, ఆళ్లగడ్డ నియోజకవర్గం బ్రాహ్మణ సంక్షమ సంఘం అధ్యక్షులు డాక్టర్ గణపతి రావు, పతంజలి శ్రీనివాస్, రాధాకృష్ణ, ప్రసాద్, పద్మనాభరావు, రఘు , శేషు ,వేద వ్యాస్ త దితరులు పాల్గొన్నారు.

# రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నడిగడ్డ నాగేంద్ర**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** రైతులు దళారుల చేతుల్లో నష్టపోకుండా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం కొరకు ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగడ్డ నాగేంద్ర అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నడిగడ్డ నాగేంద్ర ప్రారంభించారు. అనంతరం నడిగడ్డ నాగేంద్ర మాట్లాడుతూ రైతులు దళారుల చేతుల్లో నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ప్యాపిలి మండలం బ్రాంచ్ మేనేజర్ శరణ్య, రైతులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న నడిగడ్డ నాగేంద్ర, అధికారిణి శరణ్య

# ఘనంగా జైత్రా- వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు



జైత్రా వార్షిక క్రీడా దినోత్సవ వేడుకల్లో జ్యోతిని వెలిగించిన ఎంఈఓ, ఏఎస్ఐ

**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నన్నూరు గ్రామంలోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జైత్రా వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు ప్రిన్సిపల్ కాదంబరి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ రాంభూపాల్ రెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రీడల యొక్క ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు గెలుపు, ఓటమి మధ్య తారమ్యాన్ని అర్థం చేసుకుంటారని, విద్యార్థులలో ప్రతిభను వెలికి తీయడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులందరూ క్రీడల్లో పాల్గొనడానికి ప్రోత్సహిస్తూ తగిన అవకాశాలు పాఠశాలలో కల్పిస్తూ విద్యార్థులను ముందుకు తీసుకు వెళ్తున్నారని అన్నారు. ఈ ఏఓ మల్లికార్జునరావు, విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయండి

**★ఎంవి పౌండేషన్ రాష్ట్ర కో..ఆర్డినేటర్ భాస్కర్**

**హొళగుంద,మేజర్‌న్యూస్:** బాలల హక్కుల పరిరక్షణ కోసం మండలంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంవి పౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ కోరారు. బుధవారం సిఆర్‌పిఎఫ్ (బాలల హక్కుల హక్కుల పరిరక్షణ కమీటి) ఆధ్వర్యంలో బాలల హక్కులు బాల కార్మీకులు,బాల్య వివాహాలగురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హజరైన భాస్కర్ మాట్లాడుతు మండలంలోని బాల కార్మీకల వ్యవస్థను నిర్మూలించాలని బాల్య వివాహాలను నివారించాలని ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్బంగా నూతన కమిటిని ఎన్నుకున్నారు. మండల కమిటి కన్వీనర్‌గా కెంచప్ప, కో కన్వీనర్‌గా నాగరకన్వీ వెంకటేశ్,దేవన్న,మండల కమిటి గౌరవ అధ్యక్షుడుగా లింగంపల్లి హనుమంతురాయుడును ఏన్నుకున్నారు. ఈ సందర్బంగా రాష్ట్ర కోఆర్డినేటర్‌ను ఇతరులను సత్కరించారు. ఎంవి పౌండేషన్ మండల కోఆర్డినేటర్ సేవానాయక్, ఇతరులు పాల్గొన్నారు.




రాష్ట్ర కో..ఆర్డినేటర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

# ఎన్‌సిసి అంటే యూనిఫాం ధరించడం కాదు

**- క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి**

**- అధికారులు లేఫ్టినెంట్ కల్‌నల్ శశికమార్,కల్‌నల్ అలోక్ త్రిప్టార్టీ**

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల కే ంద్రలోని ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను కర్నూలు గ్రూప్ కమాండర్ కల్‌నల్ అలోక్ త్రిప్టార్టీ, 28వ పటాలపు అధికారి లేఫ్టినెంట్ కల్‌నల్ శశికుమార్‌లు వార్షిక తనిఖీలో భాగంగా గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు మీ పాఠశాలను సందర్శించి మీలో ఉన్న క్రమశిక్షణ ఉత్సాహాన్ని చూడడం సంతోషంగా ఉందని, అయితే ఎన్‌సిసి అంటే కేవలం యూనిఫామ్ ధరించడం కాదు అది క్రమశిక్షణకు, సమయపాలనకు మారుపేరని వారు అన్నారు. మీ జీవితంలో మీరు విజయం సాధించడానికి ఎన్‌సిసి మంచి పునాదిలాంటిదన్నారు. కుల, మత, ప్రాంత విబేధాలకు అతీతంగా దేశం కోసం పనిచేసే గుణాన్ని విద్యార్థి దశలోనే అలవర్చుకోవాలని భవిష్యత్తులో ఈ దేశానికి గొప్పనాయకులుగా ఎదగాలని తోటి వారికి సహాయం చేయడం ఇక్కడే నేర్చుకోవాలన్నారు. సమాజికసేవా మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలన్నారు. వారికి పాఠశాల ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో మోమెంటో, శాలువతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, ఎన్‌సిసి అధికారి అనిల్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు అందిస్తున్న లేఫ్టినెంట్ కల్‌నల్

**కేసీ కెనాల్‌లో**

# యువకుడు గల్లంతు

**పాములపాడు మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని జూటూరు మజార గ్రామమైన కోల్స్ ఆనందపురం గ్రామ శివారుల్లో ఉన్న కేసీ కెనాల్‌లో గ్రామానికి చెందిన వంశీ (18) అనే యువకుడు గల్లంతైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, వంశీ ఇటీవల ఆరు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వంశీ కేసీ నాల్ దూకినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు మరియు గ్రామస్తులు కలిసి కాలువ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.

# నాణ్యమైన మందులను ప్రజలకు అందుబాటులో ఉంచాలి

**పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజా మురళీకృష్ణ**



**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** నాణ్యమైన, సరసమైన ధరలకు ప్రజలు వినియోగించే మందులను అందుబాటులో ఉంచాలని ప్యాపిలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజా మురళీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో అపోలో ప్రతినిధుల ఆధ్వర్యంలో నూతన అపోలో ఫార్మసీ కేంద్రాన్ని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజా మురళీకృష్ణ, అపోలో ఫార్మసి ప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శేషఫణి, పర్వతం మధు, అపోలో సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య



## 47వ జూనియర్ నేషనల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన విశ్వనాథ్

**-విశ్వనాథ్ మరియు కోచ్ సుబ్బరాయుడుని అభినందించిన మున్సిపల్ చైర్మెన్**



విశ్వనాథ్ ను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ రామలింగారెడ్డి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఢిల్లీలో జరిగే 47వ జూనియర్ నేషనల్ గేమ్స్ పోటీలలో డిఎస్ ఎన్ విశ్వనాథ్ ఎంపికయ్యాడు. ఈనెల 11,12,13,14వ తేదీలలో జరిగే నేషనల్ గేమ్స్‌లో ఆడనున్నట్లు ఆర్ఆర్ అకాడమీ కోచ్ డిపి సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డిని వారు కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డీఎస్ఎన్ విశ్వనాథ్ (బోల్ట్ ) ను అభినంచడంతో పాటు జాతీయ స్థాయి పోటీలలో కూడా రాణించాలన్నారు. అనంతరం కోచ్, విశ్వనాథ్ తండ్రి సుబ్బరాయుడుని అభినందిస్తూ తన కొడుకుతో పాటు సమానంగా ఆళ్లగడ్డలో ఎంతోమం క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలలో పథకాలు సాధించేలా కృషి చేస్తున్న సుబ్బరాయుడు సేవలను కొనియాడారు. విశ్వనాథ్ 2023 నుంచి ఇప్పటి వరకు ఆరుసార్లు రాష్ట్రస్థాయి పోటీలు, మూడుసార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన డం అభినందించదగ్గ విషయం అన్నారు. క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారా లు అందిస్తామన్నారు. కోచ్ సుబ్బారాయుడు మాట్లాడుతూ ఆళ్లగడ్డను క్రీడల గడ్డగా మారుస్తామన్నారు.

## జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన ప్యాపిలి విద్యార్థి



విద్యార్థి హరినాథ్‌రెడ్డిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** 2025 డిసెంబర్‌లో విజయవాడ నందు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో జరిగిన సైక్లింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి, జాతీయ స్థాయికి ఎంపికైన ప్యాపిలి 10వ తరగతి విద్యార్థి హరినాథ్‌రెడ్డిని పాఠశాల హెచ్ఎం పద్మావతిభాయితో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

## కార్పొరేషన్ ఆదాయానికి గండి పడితే సహించను

**-నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



మాట్లాడుతున్న కమీషనర్ విశ్వనాథ్

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కి రావాల్సిన ఆదాయానికి గండి పడేలా వ్యవహరిస్తే సహించబోమని, కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. బుధవారం ఆయన రెవెన్యూ విభాగ సిబ్బందితో మున్సిపల్ దుకాణాల అద్దెలు, పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. టైటిల్ ట్రాన్స్‌ఫర్, పన్ను విధింపు సమయంలో అవకతవకలను ఉపేక్షించబోమన్నారు. మున్సిపల్ షాపుల గుడ్‌విల్, అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జి వి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలాలిస్వామి ఉరుసు



ముస్తాబైన మౌళాలిస్వామి దర్గా

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్‌:** బనగానపల్లె పట్టణ శివారులోని మౌళాలి స్వామి దర్గా ఉరుసు ఉత్సవాలు బుధవారంనాడు ఘనంగా ముగిశాయి. హజరత్ మౌళాలిస్వామి జన్మదినం సందర్భంగా ఈ నెల 3న ఆస్థానం నుండి నవాబు వంశీయులు జెండా తీసుకొని మౌళాలిస్వామి దర్గాకు రావడంతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం గంధం, బుధవారం ఉరుసు నిర్వహించారు. హిందూ ముస్లీం సోదరులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారికి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మౌళాలిస్వామి దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై వారి మొక్కులను తీర్చుకున్నారు.

## ఘనంగా దస్తగిరయ్య స్వామి ఉరుసు



స్వామివారికి ఫాతేహా సమర్పిస్తున్న భక్తులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని లింగందిన్నె గ్రామంలో వెలసిన దస్తగిరయ్య ఉరుసు మహోత్సవం బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు, పూజారులు ఉరుసు సందర్భంగా స్వామి వారి ఆశ్వంను పట్టువస్త్రాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూలతో పూజలు చేసి గ్రామంలోని పురవీరుదల గుండా ఊరేగించారు.అనంతరం స్వామి వారి దర్గా దగ్గరకు తీసుక వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.ఉరుసుమహోత్సవంకు పలు గ్రామాల నుంచిపెద్ద ఎత్తున భక్తులు హజరయ్యారు. ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఫాతేహను స్వామి వారి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే దర్గాను ప్రత్యేక రంగులతో విద్యుత్ దీపాలతో సుంధరంగా అలంకరించారు. నియోజకవర్గంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు ఉరుకు హజరై ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. గురువారం జియారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పూజారులు తెలిపారు.

# మాంటిసోర్రిలో మెగా సైన్స్ ఎక్స్పో



సైన్స్ పరికరాలను తయారు చేసిన విద్యార్థులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నగరంలో ఏ.క్యాంపులోని మోంటెస్సోరి పాఠశాలలో బుధవారం పంచతత్వం పేరుతో మెగా సైన్స్ ఎక్స్పోను ప్రారంభించారు. మాంటిస్సోరి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వారి ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకొని మెగా సైన్స్ ఎక్స్పోను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా డాక్టర్ బి.వి.ఆర్ మోహన్ రెడ్డి సీయాన్ట్ ఫౌండర్ చైర్మన్ ఐఐటి హైదరాబాద్, డాక్టర్ జి ఎస్ ఎన్ రాజు చాన్సులర్ సెంచూరియన్ యూనివర్సిటీ, శ్రీహరి యార్లగడ్డ చైర్మన్ మహాలక్ష్మి గ్రూప్, పి చంద్రశేఖర్ ఇస్రో మాజీ సైంటిస్ట్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత మోంటిస్సోరి విద్య సంస్థలకు ఉందని కొనియాడారు. రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఐటీలో ఉన్నత స్థానానికి తీసుకెళ్తుందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని శ్రద్ధగా విద్యార్థులు నేర్చుకోవాలని వారు సూచించారు. అనంతరం విద్యార్థులుతయారు చేసిన సైన్స్ పరికరాలను, సైంటిఫిక్ ఎక్స్పోను వారు తిలకించారు. ఈ కార్యక్రమంలో మాంటిస్సోరి అధినేత డా. కృష్ణమోహన్, డా. మాధవి లత, కే ఎన్ వి రాజశేఖర్, డా.గాయిని రాజశేఖర్, ప్రిన్సిపల్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ లెవెల్ డ్రాయింగ్ పోటీలలో గురురాజ విద్యార్థుల ప్రతిభ




నేషనల్ లెవెల్ డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన గురురాజా విద్యార్థుల ప్రతిభ

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** కర్నాటకలోని చిత్రదుర్గ పట్టణానికి చెందిన చింతన ప్రకాషణ పబ్లికేషన్ వారు నిర్వహించిన జాతీయస్థాయిలో డ్రాయింగ్ పోటీలలో నంద్యాల ఎన్‌జిఓ కాలనీలో గల శ్రీగురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ బహుమతులు సాధించినట్లుగా పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. తన్విక, లక్ష్మి ప్రసన్న, ఉదయ్‌కుమార్, ప్రనూష జాతీయస్థాయిలో జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్రస్థాయిలో జయదీప్ వసీం హబీబ్, ధన్య, కావ్య బహుమతులు సాధించారు. జిల్లాస్థాయిలో 127మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా బహుమతులు సాధించిన చిన్నారులకు డైరెక్టర్ జ్ఞాపికలు అందజేసి వారి విజయాలను ప్రశంసించారు.

# మండలంలో అభివృద్ధి పనులతో కొత్త కళ






సి.బెళగల్ మండలంలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ, పలుకుదొడ్డి,సంగాల బిటి రోడ్డు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో మండలానికి కొత్తకళ సంతరించుకుంది. మండలంలో అద్వానంగా ఉన్న ప్రధాన రహదారి మొదలుకొని పలుకుదొడ్డి, సంఘాల గ్రామాలకు బిటి రోడ్డు, ఆయా గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీలు వంటి అభివృద్ధి పనులతో మండలానికి మార్గదశ ఏర్పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందులో భాగంగా నియోజకవర్గ కూటమి నాయకులు కేడిసిసి బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి,నియోజకవర్గ శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి చొరవతో మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.బుధవారం మండల కేంద్రంలో ప్రధాని రహదారి ఆనుకొని బురాన్‌దొడ్డి రోడ్డు నుండి శివాలయం గుడి వరకు చేపట్టిన డ్రైనేజీ పనులను గ్రామ ఎంపీటీసీ వీరన్న గౌడ్, ఏఎస్ఓ శ్రీనివాసులతో కలిసి ఎంపీడీఓ రాణెమ్మ పరిశీలించారు.అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో చేపట్టిన ప్రధాన రహదారి పనులు చివరి దశలో ఉన్నాయని,సిసి రోడ్డు నిర్మాణంతో ప్రజలు, ప్రయాణికుల, వాహనదారుల కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు.అదేవిదంగా డ్రైనేజి పనులకు ఎంపీపీ నిధుల నుండి ఐదు లక్షలరూపాయల అనుమతులు లభించాయని,డ్రైనేజి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ సూచించారు.

# అధిక యూరియా వాడటం అనర్థదాయకం




మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి సునీత

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** రైతులు అధిక యూరియా వాడటం వల్ల నేలకుఅనర్థదాయకం అనినేల సమతుల్యత దెబ్బతిని చౌడు భూమిగా మరిపోతుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి స నీత అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో నిరైతు సేవా కేంద్రంలో రైతులకు ఒక్క రోజు యూరియా వడకం పై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి సునీత మాట్లాడుతూ రైతులు అధికంగా యూరియాను వాడటం వల్ల భూములు చౌడు భూములుగా మారిపోతాయని భూమిలో ఉపయోగకరమైన బ్యాక్టీరియా మరియూ శిలింధ్రాలు నాశనం అవుతాయని తెలిపారు. రైతులు యూరియాను అవసరాలకు సరిపడ మాత్రమే వాడుకోవాలన్నారు. కాంప్లెక్స్ ఎర్ర వులు ఎమ్మిగనూరులో 1756 టన్నులు, గోనెగండ్లలో 532 టన్నులు, నందవరలో 286 టన్నులు, మంత్రాలయంలో 342 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. డివిజన్లోని నాలుగు మండలాల రైతులకు సరపడ యూరియా ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ఉందని తెలిపారు. ఎమ్మిగనూరు డివిజన్లో 10 వేల ఎకరాల పైగానే మొక్కజొన్న పంటను సాగు చేశారని అందుకు సరిపడ యూరియా స్టాక్ ఉందన్నారు. యూరియా కావలసిన రైతులకు రైతు సేవా కేంద్రల దగ్గర నుంచి సహకార సంఘాల ద్వార పొందవచ నన్నారు. ఇప్పటి వరకు గోనెగండ్ల మండలంలో 886టన్నులు,ఎమ్మిగనూరులో 484 టన్నులు, నందవరంలో 178 టన్నులు, మంత్రాలయం మండలంలో 132 టన్నులు రైతులకు సరఫరాచేయడం జరిగిందన్నారు. రైతులకు కావాల్సిన యూరియా ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాల ద్వార ఇండెంట్ పెట్టి రైతులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మహుమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత, వ్యవశాయ సిబ్బంది పులిరాజు, అరుణ, నిఖిల, షఫి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మండలంలో గోకులం షెడ్‌లు తనిఖీ

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మాధవరం, వేల్పనూరు గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన మీని గోకులం షెడ్లను ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ బుధవారం తనిఖీ చేశారు. వెలుగోడు మండలం రివ్యూ సమావేశం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించారు.ఈ సమావేశంలో ఉపాధి పనుల ప్రగతి, ఉపాధి పొందుతున్న కూలీల ఆదాయ మార్గాలు పని దినాలు మొదలగు పనులను సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులను మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లను కూలీల వివరాలు కంపోస్ట్ ఫిట్స్ మిని గోకులం షెడ్స్ గురించి ఆరా తీశారు. ఎంపిడివో మధుసూధన్‌రెడ్డి, ఏపివో నాగజ్యోతి , సిబ్బంది పాల్గొన్నారు.



# AP/TG TET, DSC స్పెషల్ బయాలజి




## శ్వాసక్రియ

**1. రెస్పయిర్ అంటే అర్థం ఏమిటి?**
ఎ. పీల్చడం బి. వదలడం
సి. పీల్చడం మరియు వదలడం
డి. ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలు

**2. ఊపిరితిత్తుల గురించి సరైన వాక్యాలను గుర్తించండి.**
1. ఇవి స్పాంజి లాగా ఉంటాయి
2. రెండు ఒకే పరిమాణంలో ఉంటాయి
3. ఎడమ ఊపిరితిత్తి కొంచెం చిన్నదిగా ఉంటుంది.
4. ఊపిరితిత్తులను కప్పుతూ ప్లూరా అనే రెండు పొరలుంటాయి.

ఎ. 1,2,3 మాత్రమే బి. 2,3,4 మాత్రమే
సి. 1,3,4 మాత్రమే
డి. పైవి అన్ని సరైనవే

**3. మానవుని ఊపిరితిత్తుల సామర్థ్యం ఎంత?**
ఎ. 5800 లీటర్లు బి. 5800 మి.లీ.
సి. 1200 మి.లీ. డి. 500 మి.లీ.

**4. వాయుగోళాల నుండి రక్త కేశ నాళికలోకి వాయువు మార్పిడి ఏ పద్ధతిలో జరుగుతుంది?**
ఎ. కిణ్వనం బి. విచ్ఛిన్నక్రియ
సి. ద్రవాభిసరణ డి. వ్యాపనం

**5. Respiration అనే పదం Respire అనే ఏ భాష పదం నుండి ఏర్పడింది?**
ఎ. గ్రీకు బి. లాటిన్
సి. ఫ్రెంచ్ డి. జర్మనీ

**6. జాన్ డాపర్ అనే రసాయన శాస్త్రవేత్త రాసిన గ్రంథం?**
ఎ. శరీర ధర్మ శాస్త్రం
బి. మానవ శరీర ధర్మశాస్త్రం
సి. వృక్ష శరీర ధర్మశాస్త్రం
డి. జంతు శరీర ధర్మశాస్త్రం.

**7. ఖర్చయ్యే గాలిని గుర్తించండి?**
ఎ. కార్బన్ డై ఆక్సైడ్($CO_2$) బి. నైట్రోజన్
సి. ఆక్సిజన్ డి. కార్బన్ మోనాక్సైడ్

**8. వాయు గోళాల గురించి సరైన వాక్యాలను గుర్తించండి?**
1. ఇవి ఒకే కణం మందంతో ఉంటాయి
2. ఇవి అనేక కణాలతో మందంగా ఉంటాయి
3. వీటి సంఖ్య చాలా తక్కువ
4. ఇవి అసంఖ్యాకంగా ఉంటాయి.

ఎ. 1 & 2 మాత్రమే బి. 3 & 4 మాత్రమే
సి. 1 & 3 మాత్రమే డి. 1&4 మాత్రమే

**9. సరైన దానిని గుర్తించండి.**
1. $Hb+4O_2 \rightarrow Hb(O_2)_4$ ఊపిరితిత్తులలో
2. $Hb(O_2)_4 \rightarrow Hb+4O_2$ కణజాలాలలో

ఎ. 1 మాత్రమే బి. 2 మాత్రమే
3. 1&2 మాత్రమే 4. 1&2 సరికావు

**10. శ్వాసక్రియ అనేది**
ఎ. జీవ, భౌతిక చర్యల సరళ ప్రక్రియ
బి. జీవ, భౌతిక చర్యల సంక్లిష్ట ప్రక్రియ
సి. జీవ, భౌతిక, రసాయనిక చర్యల సరళ ప్రక్రియ
డి. జీవ, భౌతిక, రసాయనిక చర్యల సంక్లిష్ట ప్రక్రియ

**11. ఉదర వితానం చదునుగా మారినపుడు**
1. ఉరః కుహర ఘన పరిమాణం పెరుగుతుంది.
2. ఉరః కుహర ఘన పరిమాణం తగ్గుతుంది.
3. ఊపిరితిత్తుల లోపలి పీడనం పెరుగుతుంది.
4. ఊపిరితిత్తుల లోపలి పీడనం తగ్గుతుంది.

ఎ. 1&2 సరైనవి బి. 2&3 సరైనవి
సి. 1&4 సరైనవి డి. 2&4 సరైనవి

**12. శ్వాసక్రియ గురించి తెలియని కాలంలో శ్వాసక్రియ అనే పదాన్ని ఏ విధంగా ఉపయోగించేవారు?**
ఎ. వాయు ప్రసార మార్గంగా
బి. ఉష్ణాన్ని ఉత్పత్తి చేసే ప్రక్రియగా
సి. వైద పరిభాష పదంగా డి. పైవన్నీ

**13. సరైన క్రమంలో అమర్చండి**
1. ఊపిరితిత్తులలో వాయుమార్పిడి
2. ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలు
3. కణజాలాల్లో వాయుమార్పిడి
4. రక్తం ద్వారా వాయు రవాణా
5. కణ శ్వాసక్రియ

ఎ. 1,2,3,4,5 బి. 5,4,3,2,1
సి. 2,1,3,4,5 డి. 2,1,4,3,5

**14. సరైన వాక్యాన్ని గుర్తించండి.**
1. క్లోరోఫిల్‌లో మెగ్నీషియం అణువు ఉంటుంది.
2. హిమోగ్లోబిన్‌లో ఇనుము ఉంటుంది.

ఎ. 1 మాత్రమే బి. 2 మాత్రమే
సి. 1&2 సరైనవి డి. 1&2 సరికావు




**15. ఊపిరితిత్తులలోనికి గాలి రావడానికి, బయటకు పోవటానికి సహాయపడేదాన్ని గుర్తించండి.**
ఎ. ఛాతీ కండరాలు మాత్రమే
బి. ఉదర వితానం మాత్రమే (డయాఫ్రమ్)
సి. ఎ మరియు బి
డి. ఊపిరితిత్తులు తమంతట తామే గాలిని తీసుకుంటాయి. బయటకు పంపుతాయి.

**16. ఆ కాలంలో పిలువబడ్డ స్థిరమైన వాయువును ఈ కాలంలో ఏమని పిలుస్తున్నాం?**
ఎ. ఆక్సిజన్ బి. ఆర్గాన్
సి. నైట్రోజన్ డి. కార్బన్ డై ఆక్సైడ్

**17. గ్లూకోజ్ ద్రావణంలో ఆక్సిజన్ లభ్యత తక్కువ అయినపుడు నీలిరంగు ద్రావణం ఏ రంగులోకి మారుతుంది?**
ఎ. ఎరుపు బి. పసుపు
సి. నలుపు డి. గులాబి

**18. జతపరచండి**
1. లాక్టోబాసిల్లస్( ) ఎ. $CO_2$+ నీరు+ శక్తి
2. ఈస్ట్ ( ) బి. $C_6H_{12}O_6$
3. జంతువులు () సి. లాక్టిక్ ఆమ్లం+ శక్తి
4. గ్లూకోజ్ ( ) డి. ఇథనాల్+ కార్బన్ డై ఆక్సైడ్ + శక్తి

ఎ. 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
బి. 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
సి. 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
డి. 1-సి, 2-డి, 3-బి, 4-ఎ

**19. గాలిని వెచ్చచేయడం, గాలికి తేమను కలపడం వంటి ప్రక్రియలు ఇక్కడ జరుగుతాయి.**
ఎ. స్వరపేటిక బి. గ్రసని
సి. వాయునాళం డి. నాశికారంధ్రాలు

**20. కణశక్త్యాగారాలు (పవర్ హౌసెస్ ఆఫ్ ద సెల్) అని ఏ కణాంగాన్ని అంటాం?**
ఎ. హరితరేణువు బి. రైబోసోమ్స్
సి. లైసోజోమ్స్ డి. మైటోకాండ్రియా

**21. జతపరచండి**
1. యమ ( ) ఎ. ధృడమైన శరీరాకృతి పొందడం
2. నియమ ( ) బి. సామాజిక క్రమశిక్షణ పాటించడం
3. ఆసన ( ) సి. శ్వాసక్రియ శక్తిని పెంపొందించుకోవడం
4. ప్రాణాయామ ( ) డి. వ్యక్తిగత క్రమశిక్షణ పాటించడం

ఎ. 1-ఎ,2-బి,3-సి,4-డి
బి. 1-ఎ,2-బి,3-డి,4-సి
సి. 1-బి,2-డి,3-సి,4-ఎ
డి. 1-బి,2-డి,3-ఎ,4-సి

**22. ఈ క్రింది వాటిలో గట్టి పెట్టె వంటి నిర్మాణాన్ని గుర్తించండి.**
ఎ. గ్రసని బి. వాయునాళం
సి. స్వరపేటిక డి. నాసికా కుహరం

**23. అవాయు శ్వాసక్రియ ఎప్పుడు జరుగుతుంది?**
ఎ. ఆక్సిజన్ లేనపుడు
బి. ఆక్సిజన్ తక్కువగా ఉన్నపుడు
సి. ఎ&బి
డి. ఎక్కువ మొత్తంలో ఆక్సిజన్ ఉన్నపుడు

**24. ప్రాణాయామంలో యామ అనగా**
ఎ. వాయువు బి. గాలి
సి. శ్వాస డి. ప్రయాణం

**25. గ్లూకోజ్ ద్రావణానికి ఆక్సిజన్ సరఫరా కాకుండా నిరోధించే ద్రావణాన్ని గుర్తించండి.**
ఎ. డయాజిన్ గ్రీన్ బి. జానస్ గ్రీన్ బి
సి. పారాఫిన్ డి. పొటాషియం హైడ్రాక్సైడ్

**26. ఇథనాల్ ఏ ఉష్ణోగ్రత వద్ద మరుగుతుంది?**
ఎ. 100 డిగ్రీల సెం.గ్రే.
బి. 90 డిగ్రీల సెం.గ్రే. సి. 80 డిగ్రీల సెం.గ్రే.
డి. 70 డిగ్రీల సెం.గ్రే.

**27. ఈ క్రింది దానిని కణం యొక్క ఎనర్జీ కరెన్సీ అని అంటారు.**
ఎ. మైట్రోకాండ్రియా బి. ADP
సి. ATP డి. NADPH

**28. జతపర్చండి**
1. మాంగ్రూవ్ మొక్కలు ( ) ఎ. ప్రత్యేక కణజాలం
2. ఆర్కిడ్ జాతి మొక్కలు ( ) బి. శ్వాసవేర్లు
3. శ్వాసక్రియ ( ) సి. విచ్ఛిన్నక్రియ
4. కిరణజన్యసంయోగక్రియ ( ) డి. నిర్మాణాత్మక క్రియ

ఎ. 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
బి. 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
సి. 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
డి. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి

**29. గ్లూకోజ్ ద్రావణంలో ఇంకా ఆక్సిజన్ ఉన్నదో లేదో తెలుసుకోవాలంటే ఏ ద్రావణాన్ని ఉపయోగించాలి?**
ఎ. డయాజిన్ గ్రీన్ బి. జానస్ గ్రీన్ బి
సి. ఎ (లేదా) బి డి. పారాఫిన్ ద్రావణం

**30. ఈస్టులో అవాయు శ్వాసక్రియ ద్వారా గ్లూకోజ్ నుండి ఏర్పడే అంత్య పదార్థాలు**
ఎ. లాక్టిక్ ఆమ్లం, శక్తి
బి. ఇథనాల్, కార్బన్ డై ఆక్సైడ్, శక్తి
సి. కార్బన్ డై ఆక్సైడ్, నీరు, శక్తి
డి. ఇథనాల్, శక్తి

**31. జతపరచండి**
1. వాయునాళాలు ( ) ఎ. చేపలు
2. మొప్పలు ( ) బి. కప్ప
3. ఊపిరితిత్తులు ( ) సి. కీటకాలు
4. చర్మం/ఆస్యగ్రసని/ ఊపిరితిత్తులు ( ) డి. సరీసృపాలు

ఎ. 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
బి. 1-సి, 2-ఎ, 3-బి, 4-డి
సి. 1-డి, 2-ఎ, 3-సి, 4-బి
డి. 1-సి, 2-బి, 3-ఎ, 4-డి

**32. ప్రతి ATP లో ఎన్ని కేలరీల శక్తి నిల్వ ఉంటుంది?**
ఎ. 7000 కేలరీలు బి. 7100 కేలరీలు
సి. 7200 కేలరీలు డి. 7300 కేలరీలు

**33. వాయువు ఇక్కడ వడబోయబడుతుంది.**
ఎ. నాసికారంధ్రాలు బి. నాసికా కుహరం
సి. గ్రసని డి. స్వరపేటిక

**34. చక్కెర ఈస్ట్ ద్రావణం నుండి ఏ ప్రక్రియ ద్వారా ఇథనాల్‌ను వేరు చేయవచ్చు?**
ఎ. ద్రవాభిసరణ (ఓస్మాసిస్) బి. విసరణ
సి. అంశికస్వేదనం డి. విచ్ఛిన్నప్రక్రియ

**35. పతంజలి మహర్షి యోగాభ్యాస ప్రక్రియలో ఎన్ని విభాగాలలో ఎన్ని నియమాలను ప్రవేశపెట్టాడు?**
ఎ. 6 విభాగాలలో 197 నియమాలు
బి. 4 విభాగాలలో 195 నియమాలు
సి. 8 విభాగాలలో 196 నియమాలు
డి. 8 విభాగాలలో 195 నియమాలు

**36. తీవ్రమయిన వ్యాయామం చేసిన తర్వాత మన కండరాలు నొప్పికి దారి తీస్తాయి. ఈ నొప్పికి కారణం**
ఎ. సిట్రిక్ ఆమ్లం బి. బోరిక్ ఆమ్లం
సి. లాక్టిక్ ఆమ్లం డి. సల్ఫ్యూరిక్ ఆమ్లం.

**జవాబులు :**
1)ఎ, 2)సి, 3)బి, 4)డి, 5)బి, 6)బి, 7)సి, 8)డి, 9)సి, 10)డి, 11)సి, 12)డి, 13)డి, 14)సి, 15)సి, 16)డి, 17)డి, 18)సి, 19)బి, 20)డి, 21)డి, 22)సి, 23)సి, 24)డి, 25)సి, 26)డి, 27)సి, 28)బి, 29)సి, 30)బి, 31)ఎ, 32)సి, 33)బి, 34)సి, 35)డి, 36)సి



చకినారపు
సతీష్ కుమార్,
సీనియర్ ఫ్యాకల్టీ

APPSC,TGPSC
UPSC CIVIL SERVICES
EXAMS SPECIAL

# మానవ హక్కులు-పరిరక్షణ

**మానవుల మనుగడకు అవసరమైన కనీస హక్కులే మానవ హక్కులు. ఇవి కుల, మత, ప్రాంత, లింగ భేదాలకు అతీతం. మానవ హెూదాను పరిరక్షించడానికి మానవ హక్కులు అవసరం. పౌర స్వేచ్ఛలో జోక్యం చేసుకోవడానికి రాజ్యం ప్రయత్నించినప్పుడు అడ్డుపడే రక్షణలే మానవ హక్కులు అని రోనాల్డ్ డార్విన్ అభిప్రాయపడ్డాడు. జాక్ డోన్నీ అభిప్రాయంలో నాగరికతకు నూతన ప్రమాణాలే మానవ హక్కులు. అందరికీ మానవ హక్కులు అనేది ఐరాస 21వ శతాబ్ద నినాదం.**

**మానవ హక్కుల రూపాలు:**

1. వివక్ష నుంచి స్వాతంత్య్రం, కుల, మత, లింగ, తెగ, ప్రాంతీయ వివక్షతకు గురికాకుండా ఉండటం.
2. బానిసత్వం నుంచి స్వాతంత్య్రం, గౌరవ ప్రదమైన జీవన ప్రమాణాలను అనుభవించటం.
3. వ్యక్తిలోని బిడీకృతమైన శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునే స్వాతంత్య్రం
4. భయం నుంచి స్వాతంత్య్రం, ప్రాణానికి భద్రత, హింస, నిర్బంధానికి గురికాకుండా ఉండటం
5. ఆధర్మం నుంచి స్వాతంత్య్రం
6. ఆలోచన, వాక్ స్వాతంత్య్రం, సంఘాలుగా ఏర్పడే స్వాతంత్య్రం
7. గౌరవప్రదమైన పనిచేసుకునే స్వాతంత్య్రం, పీడనాన్ని నిరోధించే హక్కు

మానవ హక్కులు, మానవాభ్యుదయం రెండిటిదీ విడదీయరాని బంధం, ఐక్యరాజ్యసమితి చార్టర్లో, మానవ హక్కుల ప్రకటనలో, ఇతర అంతర్జాతీయ చార్టర్లలో మానవ హెూదా (Dignity) ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత రాజ్యాంగం కూడా పీఠికలో మానవ హెూదాను ప్రాథమిక విలువగా పేర్కొన్నది. సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన ఐరాసలో రూపుదిద్దుకుంటున్న తరుణంలోనే (1948) మన రాజ్యాంగ రూపకల్పన కూడా ప్రారంభమయ్యింది. రాజ్యాంగంలో మూడో భాగంలో వివరించిన ప్రాథమిక హక్కులు, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చార్టర్లోని 2 నుంచి 21 వరకూ ప్రకరణలు అదేవిధంగా రాజ్యాంగంలో నాల్గో భాగంలో వివరించిన ఆదేశసూత్రాలు, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చార్టల్లోని 22 నుంచి 28 ప్రకరణలు ఒకే రకమైనవి. 1968లో ఐరాస ఆమోదించిన అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం, అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల ఒప్పందం మానవహక్కుల పరిధిని మరింత విస్తృతం చేశాయి.

మానవ హక్కుల భావనను రెండో ప్రపంచ యుద్ధానంతరం వచ్చిన ఆలోచనగా భావిస్తున్నారు. వాస్తవానికి హక్కుల భావన అమెరికా స్వాతంత్య్ర ప్రకటన (1776) లో ఒక ముఖ్య నినాదం. మానవులంతా సమానులు. అన్యాక్రాంతం గురికావడానికి వీలులేని హక్కులను సృష్టికర్త ప్రసాదించాడు. ఫ్రెంచి విప్లవ ప్రకటన (1798) కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. మానవులు స్వతంత్రులుగా జన్మించి స్వతంత్రంగా కొనసాగుతూ సమాన హక్కులతో ఉంటారు. దురదృష్టవశాత్తూ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో పలు కారణాలతో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నది. అంతర్జాతీయంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయడానికి ఐరాస మానవహక్కుల కమిషన్ను 1946లో ఏర్పాటు చేశారు. సాంఘీక, ఆర్థిక మండలిలో అంతర్భాగమైన ఈ కమిషన్లో 53 సభ్యదేశాలకు మూడేళ్ల పదవీ కాలానికి సభ్యత్వముండేది. ప్రతి ఏటా 1/3 వంతు మంది పదవీ విరమణ చేసేవారు. మానవ హక్కుల ప్రోత్సాహం, పరిరక్షణ కార్యకలాపాల నిర్వహణకు ఒక ఉప కమిషన్ పనిచేసేది. దాని స్థానంలో 2006లో మానవ హక్కుల కౌన్సిల్ ఏర్పాటయ్యింది.

**భారతదేశంలో మానవ హక్కులు:** ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్లో 1960, 1970 దశాబ్దాలలో మానవ హక్కుల ఉల్లంఘనలు ఎక్కువగా జరిగాయన్న విమర్శలు వచ్చాయి. సగటు పౌరునికి ప్రాణ రక్షణ, వాక్ స్వాతంత్య్రం మొదలైనవి నానాటికీ కరవవుతున్నాయని పౌర సమాజం ఉద్యమించింది. రాజకీయ నాయకుల్లో, ప్రభుత్వోద్యోగుల్లో జవాబుదారీతనం సన్నగిల్లింది. దీంతో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో మానవ హక్కుల కమిషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ 1993 జాతీయ మానవ హక్కుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చింది. దీనిని 2006లో సవరించారు.

**జాతీయ మానవ హక్కుల కమిషన్:**

ఇది బహుళసభ్య వ్యవస్థ, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షునిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి (పదవిలో ఉన్న లేదా విరమణ చేసిన), హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (పదవిలోనున్న లేదా విరమణ చేసిన), మానవహక్కుల కార్యకలాపాల్లో చురుకుగా ఉన్న ఇద్దరు వ్యక్తుల్ని సభ్యులుగా నియమిస్తారు.

ప్రధానమంత్రి నేతృత్వంలో హెూం మంత్రి, లోక్సభ స్పీకర్, లోక్సభ, రాజ్యసభల్లోని ప్రతిపక్ష నాయకులు, రాజ్యసభ ఉపాధ్యక్షులు సభ్యులుగా ఉన్న కమిటీ సిఫార్సు మేరకు కమిషన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. పదవీకాలం ఐదు సంవత్సరాలు లేదా 70 సంవత్సరాలు వయసు వచ్చేంత వరకు (ఈ రెండింటిలో ఏది ముందు జరిగితే అది). అధ్యక్షుడి పదవీ కాలం ఐదేళ్లు. సభ్యులు



రెండుసార్లు పదవిలో (పదేళ్లు) కొనసాగవచ్చు. అయితే 70 సంవత్సరాల వయోపరిమితి నిబంధన వర్తిస్తుంది. పూర్తికాల సభ్యులతో పాటు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అల్ప సంఖ్యాక వర్గాల కమిషన్, జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షులు పదవీ రిత్యా దీనిలో సభ్యత్వాన్ని పొందుతారు. కమిషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారికి సెక్రటరీ జనరల్ హెూదాఉంటుంది. ఈ అధికారికి భారత ప్రభుత్వ కార్యదర్శి స్థాయి ఉంటుంది.

**విధులు**

1) కమిషన్ స్వయంగా లేదా బాధితుని పిర్యాదు మేరకు లేదా న్యాయస్థానం ఉత్తర్వు మేరకు మానవ హక్కుల ఉల్లంఘనలను విచారించడం
2) న్యాయస్థానం అనుమతి మేరకు మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించిన వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం
3) ప్రభుత్వ నిర్వహణలోని సంస్థలను, జైళ్ళను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయడం
4) మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను, శాసనసభలు రూపొందించిన చట్టాలను సమీక్షించి వాటిని ప్రభావవంతంగా అమలు చేయడానికి సూచనలివ్వడం
5) ఉగ్రవాద కార్యకలాపాల వల్ల మానవ హక్కులకు భంగం కలుగుతున్న పరిస్థితులను సమీక్షించి నివారణ చర్యలను సూచించడం
6) అంతర్జాతీయ ఒప్పందాలను అధ్యయనం చేసి అవి మానవ హక్కులకు ప్రతిబంధకాలుగా ఉంటే తగిన నివారణ చర్యలు సూచించడం
7) మానవ హక్కులకు సంబంధించిన అంశాల పై పరిశోధనలు జరపడం
8) సమాజంలో మానవ హక్కుల అక్షరాస్యతను ప్రోత్సహించి, ప్రజల్లో అవగాహన కల్పించడం
9) స్వచ్ఛంద సేవా సంస్థలను మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేసేటట్లు ప్రోత్సహించడం

**అధికారాలు:**

తన విధులను నిర్వహించడానికి కమిషన్ సివిల్ కోర్టుకున్న అధికారాలను కలిగి ఉంటుంది. సమన్ల జారీకి, సంబంధిత వ్యక్తులను విచారించడానికి అవసరమైన అధికార పత్రాలు, అఫిడవిట్లు, సాక్ష్యాధారాలను సేకరించడానికి, న్యాయస్థానం లేదా ప్రభుత్వ కార్యాలయం నుంచి అవసరమైన సమాచారం పొందడానికి, అధికార ప్రతులను విచారించి, పరిశీలించే అధికారాన్ని కలిగి ఉంది.

కమిషన్ తాను దర్యాప్తు చేస్తున్న కేసును, మేజిస్ట్రేట్కు పంపడానికి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్కు ఏదైనా కేసును బదిలీ చేయడానికి అధికారం ఉంటుంది. విచారణ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవచ్చు. ఆ సమయంలో సదరు ఉద్యోగులు కమిషన్ పరిధిలో పని చేస్తారు. తనకందిన ఫిర్యాదుల పై తగిన సమాచారం ఇవ్వాలని సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలను కమిషన్ కోరవచ్చు. సకాలంలో ప్రభుత్వం నుంచి తగిన సమాచారం లభించకపోతే తానే స్వయంగా విచారణ నిర్వహించవచ్చు. విచారణ ముగిసిన తర్వాత, కమిషన్ దృష్టిలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ జరిగితే బాధితులకు లేదా వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారమివ్వాలని, కారకులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయవచ్చు అంతేకాకుండా సుప్రీంకోర్టు లేదా హైకోర్టుల దృష్టికి తీసుకెళ్లి తగిన ఉత్తర్వులు (రిట్లు) జారీ చేయమని కోరవచ్చు.

సాయుధ బలగాలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డాయని ఫిర్యాదులు అందినప్పుడు తగిన వివరణ ఇవ్వమని ప్రభుత్వాన్ని కోరే అధికారం కమిషన్కు ఉంది. ప్రభుత్వం తాను తీసుకున్న చర్యల వివరాలు కమిషన్కు తెలియజేయాలి. కమిషన్ వార్షిక నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. దాన్ని పార్లమెంట్లో ప్రవేశపెడుతారు.

మనిషి మనిషిగా మనుగడ సాగించేందుకు అనివార్యంగా అవసరమైన హక్కులను మానవ హక్కులు అంటారు. మానవునికి కావల్సిన నైతిక హక్కులు, చట్టపరమైన హక్కులే మానవ హక్కులు. మానవుడు గౌరవప్రదంగా జీవించడానికి అవసరమైన పౌర, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక హక్కుల సమాహరమే మానవ హక్కులు. ఆదిమ సమాజంలో మానవ హక్కులు అందరికి సమానంగా లభించేవి. క్రమంగా మానవ నాగరికతతో పాటు సామాజిక, ఆర్థిక అసమానతలు కూడా పెరుగుతూ వచ్చాయి. ఆదిపత్య వర్గాలు నిమ్న వర్గాలను శ్రమ దోపిడికి గురిచేస్తూ సామాజిక దోపిడికి గురిచేయడం వలన బలహీన వర్గాల మానవ హక్కులు ఉల్లంఘనకు గురైనాయి.

అంతర్జాతీయంగా ఇంగ్లాండ్ 1215లో మానవ హక్కులకు సంబంధించి చేసిన మాగ్నకార్టా వల్ల మొదటిసారిగా మానవ హక్కులు అనే భావన ప్రపంచ వ్యాప్తంగా వెలుగులోకి వచ్చింది. క్రమంగా 18వ శతాబ్దపు చివరి నాటికి మానవ హక్కుల దృక్పథం ప్రచారంలోకి వచ్చింది. 1776లో వర్జీనియా హక్కుల బిల్లు ద్వారా అమెరిక స్వాతంత్య్ర ప్రకటన, 1789 నాటి ఫ్రెంచ్ విప్లవం ఫలితంగా మానవ హక్కులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.

ఐక్యరాజ్య సమితి 1948 డిసెంబర్ 10న మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన చేసింది ప్రపంచ దేశాలలోని ప్రజల యొక్క పౌర, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల పరిరక్షణ గురించి ప్రచారం చేయడం జరిగింది. స్వాతంత్య్రం, న్యాయం, శాంతికి మానవ హక్కులే పునాది. సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన చట్టం ముందు అందరు సమానమనే భావనకు ప్రాథమిక ఆదారం. అందరికి సమాన హక్కులుండాలని పేర్కొన్న ఈ ప్రకటన ఆధారంగా ప్రపంచంలోని అనేక దేశాలు తమ తమ స్థానిక పరిస్థితులకు తగినట్లుగా రాజ్యాంగ పరంగా ప్రజలకు మానవ హక్కులను కల్పించాయి. ఐక్యరాజ్యసమితి ఆమోదించిన ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందం 1976 నుండి అమలులోకి వచ్చింది. మన దేశంలో బ్రిటీష్ వలస పాలన కాలంలో మానవ హక్కుల ఉల్లంఘన తీవ్రస్థాయిలో జరిగింది. సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల ప్రభావం వల్ల మానవ హక్కుల పట్ల ప్రజల్లో చైతన్యం కలిగింది.

స్వాతంత్య్రానంతరం రాజ్యాంగ రూపకల్పన సమయంలో వ్యక్తి గౌరవ జీవనానికి, అధిక ప్రాముఖ్యతనివ్వడం జరిగింది. రాజ్యాంగంలో 21వ ప్రకరణ వ్యక్తి గౌరవ ప్రదంగా జీవించేందుకు హామినివ్వడం జరిగింది. సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన వాక్ స్వాతంత్య్రం హక్కు, స్వేచ్ఛగా సంచరించడం, పని హక్కు, సమాన పనికి సమానవేతనం, విద్యాహక్కు, సామాజిక భద్రత కల్పించే హక్కులను మానవ హక్కులుగా గుర్తించింది. రాజ్యాంగంలోని 14-32 వరకు గల ప్రాథమిక హక్కులు వ్యక్తి గౌరవానికి దోహదపడతాయి.

ప్రపంచ వ్యాప్తంగా పాలస్తీనా, పాకిస్థాన్, మయన్మార్, వంటి దేశాలలో అదేవిధంగా అరబ్ దేశాలలో నియంతృత్వ పాలన వల్ల మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత అమెరికా అనేక దేశాల అంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోవడం, అంతర్జాతీయంగా అధిపత్యం కోసంజరుపుతున్న యుద్ధాల వల్ల కూడా మానవ హక్కుల ఉల్లంఘణ జరుగుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా అమ్నెస్టి ఇంటర్నెషనల్ మానవ హక్కుల పరిరక్షణకు ప్రధానంగా కృషి చేస్తున్నది. ఆమ్నెస్టి ఇంటర్నెషనల్ స్ఫూర్తితో హ్యూమన్ రైట్స్ ఫోరమ్లు, పౌర హకుల సంఘాలు. స్వచ్ఛంధ సంస్థలు మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నాయి. మానవ హక్కుల పరిరక్షణలో ప్రసార మాధ్యమాల పాత్ర క్రియాశీలకంగా ఉన్నది. మానవ హక్కుల గురించి ప్రజల్ని చైతన్యపర్చిన సాధనాలలో చలన చిత్రాలకు కీలక పాత్ర ఉందని చెప్పవచ్చు.

మన దేశంలో కోర్టులు ప్రాథమిక హక్కులకు పూర్తి హామీ నివ్వడం హర్షించదగ్గ విషయం దీనికి తోడు 2005లో వచ్చిన సమాచార హక్కు చట్టం ప్రభుత్వం ప్రజల పట్ల బాధ్యతాయుతంగా ఉండాల్సిన తీరును చట్టపరంగా చెప్పడం వలన ప్రభుత్వంలో జవాబుదారితనం పెరిగి పరోక్షంగా పేద, బలహీన వర్గాలకు సంబందించిన ప్రయోజనాలను కాపాడటం వల్ల మానవ హక్కులు పరిరక్షించబడుతున్నాయి. న్యాయ వ్యవస్థ క్రియాశీలత, ప్రజాచైతన్యం, చలనచిత్రాల ప్రభావం, మానవ హక్కుల పరిరక్షణకు దోహదపడుతున్నాయి.



Dr. P. Harish,
Director
Perfect Academy,
Hyderabad.

# బీజేపీ, ఆర్ఎస్ఎస్‌వాదులే నిజమైన దేశద్రోహులు

**-ఉపాధి హామీ పథకం నుంచి గాంధీజీ పేరు తొలగింపు దుర్మార్గం**
**-ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రపై ధ్వజం**
**-ఏఐసీసీ సభ్యులు, కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఇంఛార్జ్ జెంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఉపాధి హామీ పథకం నుంచి జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కుట్ర పూరిత చర్య అని ఏఐసీసీ సభ్యులు, కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ జెంగిటి లక్ష్మనరసింహ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. బుధవారం నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని దామోదర సంజీవయ్య భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాట విలువలపై అవగాహన లేని మోదీ ప్రభుత్వం, గాంధీజీ పేరును తొలగించి దేశ ద్రోహానికిపాల్పడుతోందని మండి పడ్డారు. ఉపాధిహామీ పథకానికి 'రామ్‌జీ' అని పేరు పెట్టడం వెనుక నాథూరామ్ గాడ్సే పేరును స్మరించే కుట్ర దాగి ఉందని లక్ష్మనరసింహ యాదవ్ ఆరోపించారు. ప్రపంచమంతా కొలిచే మహాత్ముడి పేరును తొలగించడం సిగ్గుచేటన్నారు. "నిరుపేదలకు, గ్రామీణ ప్రజలకు జీవనధారమైన ఈ పథకాన్ని గత కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మన రాష్ట్రంలోని బండపల్లి నుంచే సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు అలాంటి పథకాన్ని ఇప్పుడు నీరుగార్చే ప్రయత్నం జరుగుతోంది" అనిఆవేదన వ్యక్తం చేశారు. దక్షణాది రాష్ట్రాలపై వివక్ష ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటి దక్షణాది రాష్ట్రాల ప్రజలు ఈ పథకాన్ని ఎక్కువగా వినియో గించుకుంటున్నారన్న అక్కసుతోనే బీజేపీ ప్రభుత్వం నిధుల్లో కోత విధిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 90 శాతం నిధులిచ్చి 100 రోజుల పని కల్పిస్తే, నేడు ఆ పని దినాలను 70 రోజుల కుతగ్గించడంఅన్యాయమన్నారు. కూలీలకు 3-4 నెలలుగా బకాయిలు చెల్లించకపోవడం కేంద్రం నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అట్టక్కించే ప్రయత్నంజరుగుతున్నా రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, వైకాపా నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ఏపీ అసెంబ్లీలో ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్థాయిలో ప్రజలను చైతన్య పరిచి బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే కొత్త పథకాలు ప్రవేశపెట్టి పేర్లు పెట్టుకోవాలి తప్ప, ఉన్న పథకాల పేర్లు మార్చి మతం పేరిట రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. ఈ సమావేశంలో కేకేసీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు పఠాన్ అభిబ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి రజాక్ వలి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి పాల్గొన్నారు.

# రైతులకు ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

**– మండల వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి**



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడు బంగ్లా మండలంలోని ఎరువు దుకాణాలను మండల వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి అకస్మీకంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఎరువుల నిల్వలు యూరియా స్టాక్ రిపోర్టు వివిధ రకాల ఎరువుల నిల్వలను తనిఖీ చే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అధిక ధరలకు అమ్మరాదని అలా ఎవరైన అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ముఖ్యంగా యూరియా రైతులందరికీ అందుబాటులో ఉందని ప్రైవెట్ దుకాణాలలో కాకుండా రైతు సేవా కేంద్రాలలో సోసైటీ నందు అందుబాటులో ఉందని ప్రతి రైతు అవసరమైన మేరకు యూరియా తీసుకోని సద్వినియోగం చేసు కోవాలనిఈసందర్భంగా రైతులను కోరారు. అలాగే ప్రతి రైతు రైతు విశిష్ట సంఖ్య కొరకు రైతుసేవా కేంద్రాలలో నమూదు రిజిస్ట్రేషన్ చేసుకోవాలనిఅన్నారు. ఈ రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే ప్రధానమంత్రి కిషాన్, అన్నదాత సుఖీభవ ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలకు అర్హులు కారు అని ఆయన అన్నారు. అలాగే ప్రతి రైతు కూడా రభీ సీజన్‌లో వేసిన పంట రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పంట సమోదు చేసుకోవాలని రైతులను కోరారు.

# సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ డిపో ముందు నిరసన

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** కడప జోన్ నందు నెలకొని ఉన్న సమస్యలకు అధికారులు సరిగా స్పంచకుండా మరియు పరిష్కరించకుండా ఉన్నందున వెంటనే ఆ సమస్యల పట్ల స్పంచి పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎన్ఎంయు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, జోనల్ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రెండవ రోజు జరిగిన ధర్నాలో వారు మాట్లాడుతూ అధికారులుఉద్యోగుల పట్ల వేధింపు చర్యలు మానుకోవాలన్నారు. ఉద్యోగ భద్రతసర్కులర్ 1/19 ను అమలు చేయాలని, అనేక సంవత్సరాలుగా ప్రమోషన్లు లేకుండా ఉన్న అన్ని కేటగిరీలకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని, సరైన వైద్య సౌకర్యం కలిగించాలని, గ్యారేజీకి సంబంధించి ప్రమోషన్లు ఇవ్వాలని, వారికి తగినటువంటి పరికరాలు తెప్పించి బస్సులు సకాలంలో నడిచేటట్లుగా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయు చీఫ్ అడ్వైజర్ హెచ్ఆర్ఎన్ రావు తో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.




ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలుపుతున్న ఎన్ఎంయు నాయకులు

# కందులకు మద్దత్తు ధర ప్రకటించిన ప్రభుత్వం



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** కంది రైతులకు ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించిందని మండల వ్యవసాయాధికారి మల్లేష్ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. మొక్కజొన్న రైతులు మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ చర్యలు పాటించాలని సూచించారు. అదేవిదంగా రూ. 8000 మద్దతుధరకు ఒక్క రైతునుండి 5 క్వింటాల వరకు కందులను ప్రభుత్వం కొనుగోలుచేస్తుందని తెలిపారు. ప్రభుత్వానికి కందులను విక్రయించే రైతులు ముందుగా ఆయా గ్రామ రైతు సేవ అధికారులను సంప్రదించి రేజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఏఈఓలు శిరీష, హిమబిందు,రైతు సేవ అధికారులు సునీత, సోమేశ్వరి మరియు రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# పదిలో ఉత్తీర్ణత శాతం పెంపొందించాలి-ఏఓ

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** పదవతరగతిలో ఉత్తీర్ణత శాతం పెంపొదించాలని అందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలనీ ఏఓమల్లేష్ కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కంబదహాల్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఏఓ వందరోజుల యాక్షన్ ప్లాన్ అమలును ఉధ్యాయులు పాటించి విద్యార్థులలో విద్యా నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగి ఒత్తిడిని తగ్గించాలని సబ్జెక్ట్ వారిగా మ్యాస్ట్ నిర్వహించి వెంకబడిన విద్యార్థులపట్ల మరింత శ్రద్ధ పెట్టి ప్రతిభను పెంపొందించాలని సూచించారు. ఏఓ మల్లేష్ కుమార్ మరియు పాఠశాల ఉధ్యాయ్యులు పాల్గొన్నారు.

# త్వరలో నగరపాలక కార్యాలయం తరలింపు



ఫ్రైడ్ ప్లాజాను పరిశీలిస్తున్న కమీషనర్

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** ఎన్ఆర్ పేటలోనినగరపాలకసంస్థ కార్యాలయాన్ని సంక్రాంతి పండుగ తర్వాత వెంకటరమణ కాలనీలోని ఫ్రైడ్ ప్లాజాలోకి తరలించనున్నట్లు కమిషనర్ పి.విశ్వ నాథ్ తెలిపారు. బుధవారం ఆయన ఫ్రైడ్ ప్లాజాను పరిశీలించారు. ప్రస్తుత మున్సిపల్ కార్యాల యం వద్ద నూతన కార్యాలయ పనుల్లో భాగంగా పాత కార్యాలయాన్ని ఫ్రైడ్ ప్లాజాకు తరలించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రూ. 85లక్షలతో ప్లంబింగ్, నెట్‌వర్క్, బోర్లు, బాత్‌రూంలు వంటి నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయన్నారు. అంతకన్నాముందు గడియారం ఆసుపత్రి ఆధుని కీకరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, ఎస్ఈ రమణమూర్తి, డిసిపి వెంకటరమణ, ప్రజారోగ్య అధికారి నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా నేర ప్రవృతిపై సమీక్ష సమావేశం



సమావేశంలో పాల్గొన్న రెండు జిల్లాల అధికారులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రోహిబిషన్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పి శ్రీదేవి బుధవారం జిల్లా నేర ప్రవృతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి రెండు జిల్లాల అధికారులు, సీఐలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవోదయం 2.0లో భాగంగా నాటుసారా నిర్మూలన చేయడం, ప్రత్యామ్నాయ ఉపాధి కార్యక్రమాలు నిర్వహించడం, అక్రమ మద్యం అరికట్టడం, అనధికారిక మద్యాన్ని నిర్మూలించడం పక్క రాష్ట్రాల మద్యంపై నిఘా ఉంచి వాటిని పూర్తిగా నిర్మూలించాలన్నారు. అనంతరం సురక్ష ఆప్ ద్వారా స్కానింగ్, ఎక్సైజ్ ఆప్ ద్వారా పర్యవేక్షణ చేయవలసినదిగా సమీక్ష సమావేశంలో వివరించారు. అలాగే మద్యం షాపులన్నింటికీ పరిమిట్ రూముల లైసెన్స్ ఇవ్వడంతో పాటు ఆర్‌టిఈ సక్రమంగా కట్టింది,లేనిది పర్యవేక్షంచి రిపోర్టు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్ హనుమంతరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి రాముడు, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్ గౌడ్, ఆయా స్టేషన్ల సిఐలు పాల్గొన్నారు.

# పంచాయతీ సెక్రెటరీలకు శిక్షణా కార్యక్రమాలు

**బనగానపపల్లెమేజర్,న్యూస్:** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డివిజన్‌స్థాయిలో పంచాయితీ సెక్రెటరీలకు నేడు ఈ గవర్నెన్స్ అను అంశంపై డివిజన్ స్థాయిలో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహింబడునని బనగానపల్లె ఎంపిడిఓ నాగరాజు తెలిపారు. డివిజన్ స్థాయిలో అందరూ పంచాయితీ సెక్రెటరీలు ఉదయం 9:30నిముషాల నుండి సాయంత్రం 5గంటల వరకు మండల పరిషత్ కార్యాలయం బనగానపల్లె నందు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమానికి హాజరు కావాలని తెలియజేశారు.

# యూరియా పై వదంతులు నమ్మకండి



యూరియాతో వ్యవసాయ అధికారి కలిమున్నిసా

**అవుకుమేజర్,న్యూస్:** అవసరాల మేరకు యూరియా వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకి ఇంత వరకు 406 టన్నుల యూరియా వచ్చినట్లు తెలియజేశారు. పంట సాగునుబట్టి ఇంకా యూరియా రానున్నట్లు తెలియజేశారు. కాబట్టి రైతులు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. అలాగే రైతులు కూడా నానో యూరియా, నానో డిఏపి కూడా వాడాలని తెలిపారు. యూరియా విషయంలో వచ్చే వందతులను నమ్మరాదని తెలిపారు.

## జాంబవ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

**నంద్యాల దేవాదాయ శాఖాధికారి మోహన్‌కు ఆలయ ఛైర్మన్ బాయికాటి ప్రహ్లాద్ విన్నపం**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** నంద్యాలలో నిర్మిస్తున్న రాష్ట్రంలోనే మొట్టమొదటి శ్రీ జాంబవ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ ఛైర్మన్ బాయికాటి ప్రహ్లాద్ కోరారు. బుధవారం నాడు ఆయన నంద్యాల జిల్లా దేవాదాయ శాఖాధికారి (ఏసీ)ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ మాట్లాడుతూ.. జాంబవస్తుని భక్తుల చిరకాల వాంఛ మేరకు నంద్యాలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే ఇది మొదటి జాంబవ ఆలయం కావడంతో భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణ పనులు వేగవంతం కావాలంటే ప్రభుత్వ సహాయ సహకారాలు అవసరమని ఆయన వివరించారు. దేవాదాయ శాఖ ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేసి, నిర్మాణానికి చేయూతనివ్వాలని కోరారు.

**విశిష్టత:** ఈ ఆలయం పూర్తయితే ఆధ్యాత్మికంగానే కాకుండా, నంద్యాల ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని తెలిపారు. ఈ విన్నపంపై జిల్లా దేవాదాయ శాఖాధికారి సానుకూలంగా స్పందించారని, నిధుల మంజూరుకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని హామీ ఇచ్చినట్లు ప్రహ్లాద్ పేర్కొన్నారు.

# కడప ఇజ్తేమాకు నంద్యాల మీదుగా ప్రత్యేక రైలు

**-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** కడపలో జరుగబోయే దీని ఇజ్తిమ కొరకు నంద్యాల మీదుగా స్పెషల్ ట్రైన్‌ను దక్షిణ మధ్య రైల్వే శాఖ ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టిడిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి బుధవారం తెలిపారు. కడపలో దీని ఇజ్తిమ జనవరి 23 నుండి 25 వరకు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు ఈ ఇజ్తిమకు హాజవుతారని, దీనిని దృష్టిలో పెట్టుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పెషల్ ట్రైన్ నడుపుతున్నారన్నారు. రైలు నెంబర్ 07140 చర్లపల్లి – తిరుచానూరు 11వ తేదీన చర్లపల్లిలో బయలుదేరి వయా నిజామాబాద్, వరంగల్, విజయవాడ, గుంటూరు మీదుగా నంద్యాలకు 23వ తేదీ ఉదయం 5:30కు వచ్చి ఇక్కడి నుంచి కడపకు బయలుదేరి వెళుతుందన్నారు. తిరిగి రేణిగుంట మీదుగా తిరుచానూరు చేరుకుంటుందని రైలు నెంబర్ 07141 తిరుచానూరులో 25 జనవరి రాత్రి 11:30కు బయలుదేరి కడపకు ఉదయం 6:50 చేరుకొని గుంటూరు, విజయవాడ, వరంగల్ నిజామాబాద్ మీదుగా చర్లపల్లికి వెళ్ళనుందన్నారు. నంద్యాల నుండి కడపకు ఇజ్తిమాకు వెళ్లే భక్తులకు ఈ రైలు చాలా ఉపయోగపడుతుందని ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. ఇజ్తిమాకు స్పెషల్ ట్రైన్ సౌకర్యం కల్పించిన సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు ఎంపి ధన్యవాదాలు తెలిపారు. నంద్యాల జిల్లా ముస్లిం సోదరులు ఈ ప్రత్యేక రైలు సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** భారతదేశంలో డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి అన్నారు. జాతీయ యువదినోత్సవ వారోత్సవాలలో భాగంగా బుధవారం ప్రభుత్వ బిసి కళాశాల బాలికల వసతి గృహంలో డ్రగ్స్ రహిత భారతదేశం పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలనయువతకు కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, సామాజిక దుష్ప్రభావాల గురించి అవగాహన కలిగించామన్నారు.యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రజలు డ్రగ్స్ నేరాలు, సంబంధిత అంశాలపై నేరుగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1933కికాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. వివేకానంద అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరేష్ మాట్లాడుతూ వివేకానందుడు పిల్లలందరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రభుత్వ టీచర్ గీతా పుష్పలత మాట్లడుతూ వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని యువత జీవితంలో అభివృ ద్ధి పథంలో నడవాలని సూచించారు. కర్నూలు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారదా మాట్లాడుతూ బాల్యవివాహాలు వ్యతిరేకించడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని అలాగే బాల్య వివాహాలు చేసుకుంటే ఎన్నో నష్టాలు ఉన్నాయని వివరి ంచారు. బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞను బాలికలతో చేయించారు. పిల్లలకు చట్టపరమైన సమస్యలుంటే లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 కు కాల్ చేస్తే వెంటనే న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సదస్సులో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, లీగల్ ఎయిడ్ మెంబర్ డా. రాయపాటి శ్రీనివాసులు, హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్ కనకలత, బచ్పన్ బచావో ఆందోళన్ ఎన్జీవో మౌనిక, బాలికలు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి నూట ఇరవైఐదు రోజుల పని-ఏపీడి పద్మావతి

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :**

వికసిత్ భారత్ –జి రామ్ జి పథకం ద్వారా పని కోరిన ప్రతి కుటు ంబానికి 100నుండి125రోజుల పని కల్పించాలని జిరామ్ జి ఉపాధి హామీ సిబ్బందికి ఏపీడీ పద్మావతి సూచించారు.బుధవారం మండల పరిషత్ మీటింగ్ హాల్ నందు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఏపీడీ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ బదులుగా వికసిత్ భారత్ – జి రామ్‌జిఉపాధి హామీ పథకంతీసుకవచ్చిందని ఇకనుండి జిరామ్ జి పేరుతో ఉపాధి హామీ పథకంనిర్వహిస్తారనిప్రజలకుఅవగాహన కల్పించాలని సూచించారు.అదేవిధంగా ఇకనుండి ప్రతి కుటుంబానికి 100నుండి125రోజులు పని కల్పించాలని తద్వారా నిరుద్యోగ భృతి ఏర్పాటు జరుగుతుందని,అదేవిధంగా డిమాండ్ నుండి పని కల్పిస్తూ కొలతలు వేతనం అందే వరకు ఆయా గ్రామ ఫెల్డ్ అసిస్టెంట్ మనిటరింగ్ చేయాల్సిన బాధ్యత గుర్తుచేశారు. వికసిత్ భారత్– జి రామ్ జి ఉపాధి హామీ పథకాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించి విజయవంతం చేయాలని సిబ్బందికి ఏపీడీ పద్మావతి సూచించారు.ఉపాధి హామీ ఎపిఓ రామన్న,ఈసి రంగస్వామి,క్లస్టర్ టిఎ, సిబ్బంది మరియు ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

# క్యాన్సర్ ను మొదటి దశలోనే గుర్తిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు

**-ఎమ్మిగనూరులో బసవతారక హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు -ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** క్యాన్సర్ ను మొదటి దశలోనే గుర్తిస్తే వైద్యం అందించేందుకు సులభం అవుతుందని దీని ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని, అలాగే ఖర్చు కూడా తగ్గుతుందని ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణం లోని శిల్పా ఎస్టేట్ అర్బన్ హెల్త్ సెంటర్లో బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్సస్టూట్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్‌పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ఎమ్మిగనూరులో బసవతారక క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత స్ర్కీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. తల్లికి వచ్చిన కష్టం ఎవరికి రాకూడదని గొప్ప ఆశయంతో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తల్లి బసవతారక పేరిట క్యాన్సర్ హాస్పిటల్ ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్యం అందించడం గొప్ప విషయమన్నారు.ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు పోతున్నారని, ఎమ్మినూరు ప్రజలకు స్ర్కీనింగ్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిన్నటి రోజు కర్నూలు నిర్వహించిన క్యాంపులో 40 మందికి క్యాన్సర్ నిర్ధారణ వచ్చిందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేసూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, మండల కన్వీనర్లు కేటీమల్లికార్జున, తిరుపతయ్య నాయుడు, మార్కెట్ చైర్మన్ మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి,


శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

పార్టీనాయకులు రంగస్వామిగాడు కలిముల్ల, మహేంద్ర, మన్సూర్, విజయలక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

**క్యాన్సర్ కు భయపడాల్సిన అవసరం లేదు - బసవతారక హాస్పిటల్ వైద్యులు రేణుక :** ప్రజలు క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరం లేదని మొదటి దశ గుర్తిస్తే వైద్యం సులభం అవుతుందని బసవతారక హాస్పిటల్ వైద్యులు రేణుక తెలిపారు. ఎమ్మిగనూరు నిర్వహించిన క్యాన్సర్‌స్ర్కీనింగ్ క్యాంప్ కార్యక్రమంలోఆమె మాట్లాడుతూ క్యాన్సర్ ను కనుక్కొని కోసం ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళలు,పురుషులుఈపరీక్షలుచేసుకోవాలనితెలిపారు. ముఖంగా 9 నుండి 14 ఏళ్ల మహిళా పిల్లలు కు సర్వైకల్ క్యాన్సర్ రాకుండా ముందస్తుగా మూడు డోసులు వ్యాక్సిన్ వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపును ఎమ్మిగనూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బసవతారక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్ష మేరకు ఆదోని జిల్లా కావాల్సిందే..!

**-కూటమి ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్షంగా దీక్ష శిబిరాల్లో పాల్గొంటా -వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి**

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** ఐదు నియోజకవర్గాల ప్రజల ఆకాంక్ష మేరకు ఆదోని జిల్లా కావాల్సిందేనని వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి అన్నారు. ఆలూరు నియోజకవర్గంలో ఆదోని జిల్లా సాధన కోసం 27 రోజులపాటు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని బుధవారం తెర్నేకల్ సురేందర్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలోపాల్గొన్న వైకాపా


వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి

సీనియర్ నాయకులు పచ్చర్లపల్లి రాఘవేందర్ రెడ్డి ఉద్యమ తోడ్పాటుకు రూ. 10వేలు ఆదోని జిల్లా సాధన సమితి జేఏసీ కమిటీ వారికి అందించారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఐదు నియోజక వర్గాలు అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా కావాల్సిందేనని అన్నారు. ఆలూరు నియోజకవర్గం నుండి 150 కి.మీల దూరంలో ఉన్న కర్నూలుకు వెళ్లి అత్యవసర వైద్య సేవలు అందక అనేక మంది మరణిస్తున్నారని, అదే ఆదోని జిల్లా అయితే విద్య, వైద్యం 30 కిలో మీటర్ల లోపే అందుతుందన్నారు. అలాగే విద్యార్థుల చదువు కొరకు ఎక్కడికి వెళ్లాల్సిన పని లేదని మన దగ్గర ప్రాంతమైన ఆదోనిలో ఉన్నత చదువులు చదివేందుకు సులువుగా ఉంటుందన్నారు. ఉద్యోగ అవకాశాలు కూడ మెండుగా ఉంటాయని, ఆదోని జిల్లా అయితే దాదాపు అన్ని కార్యాలయాలు మనకు దగ్గరలో ఉంటాయని, ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందుతాయన్నారు. ఏదిఏమైనా ఆదోని జిల్లా కోసం ఆలూరు నియోజకవర్గంలోని 6 మండలాల నుండి దీక్ష శిబిరాల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నారని అవసరమైతే ప్రత్యక్షంగా దీక్షలో పాల్గొంటానని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పచ్చార్లపల్లి రాఘవేంద్ర రెడ్డి, కమ్మరచేడు మల్లికార్జున రెడ్డి, వెంకట రెడ్డి, నారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, అనిల్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి, శివా రెడ్డి, నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

# కందుల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** కందులు కొనుగోలుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి వెంకట రాముడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చక్రాల, చందోలి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో కందులు కొనుగోలుకై సీఎం ఏపిలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కందిపంట పండించిన ప్రతి రైతుకు ఎకరాకు ఐదుక్వింటాలు చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కంది పంటకు మద్దతు ధర క్వింటానికి ఏనిమిది వేల రూపాయలు ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# పశుసంవర్ధక శాఖ ద్వారా 150ముస్తాబు కిట్లు పంపిణీ

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టితో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 150ముస్తాబు కిట్లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ చాంబర్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్, బీసీ హాస్టళ్ళలోని విద్యార్థులకు అందజేయాల్సిన ముస్తాబుకిట్లను సంబంధిత అధికారులకు కలెక్టర్ అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి గోవిందనాయక్, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రతి హాస్టల్, తరగతి గదిలో ముస్తాబు కార్నర్ ఏర్పాటు చేసి అద్దం, దువ్వెన, నెయిల్ కట్టర్, హ్యాండ్‌వాష్, శానిటైజర్ వంటి అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండాలన్నారు.

**రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి :** జిల్లాలో జాతీయ రహదారులపై జరుగుతున్న రహదారి ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. పోలీసు అధికారులు గుర్తించిన బ్లాక్ స్పాట్లలో వెంటనే స్పీడు బ్రేకర్లు, రహదారి సూచిక బోర్డులు, స్పీడ్ గన్స్, పవర్‌ఫుల్ బ్లింకర్లు


ముస్తాబు కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. బుధవారం జాతీయ రహదారి భద్రతా మసోత్సవంలో భాగంగా జిల్లా రహదారి భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, ఏఎస్పీ మందా జావలి, డీటీఓ శివారెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్‌కుమార్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 40,44,340బి, 167కె రహదారులపై తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీస్ శాఖ గుర్తించిన ప్రమాద జోన్లలో తక్షణ భద్రతా ఏర్పాటు చేయాలని సూచించారు. అతివేగం, రాంగ్‌రూట్ ప్రయాణం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి అంశాలపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.